# సచివాలయానికి తెలంగాణ తల్లి విగ్రహం

- విగ్రహం రూపురేఖలపై ప్రభుత్వం గప్‌చుప్
- విమర్శలు వస్తాయన్న భయంతో చుట్టూ కవర్లు!



సచివాలయానికి చేరుకున్న తెలంగాణ తల్లి విగ్రహం కనిపించకుండా చుట్టూ కవర్లు

హైదరాబాద్, డిసెంబర్ 5 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ ప్రభుత్వం కొత్తగా తయారు చేసిన తెలంగాణ తల్లి విగ్రహాన్ని సచివాలయానికి చేర్చింది. బుధవారం అర్ధరాత్రి తర్వాత విగ్రహాన్ని తరలించినట్టు సచివాలయవర్గాలు తెలిపాయి. కాంగ్రెస్ అగ్రనేత సోనియాగాంధీ పుట్టినరోజును పురస్కరించుకుని ఈ నెల 9న విగ్రహాన్ని సీఎం రేవంత్‌రెడ్డి ఆవిష్కరించనున్నారు. విగ్రహం ఎవరికీ కనిపించకుండా చుట్టూ కవర్లతో కప్పేశారు. విగ్రహ రూపురేఖలపై అభ్యంతరాలు వస్తాయనే భయంతోనే గోప్యత పాటిస్తున్నారని తెలంగాణవాదుల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గతంలో బీఆర్‌ఎస్ రూపొందించిన తెలంగాణ తల్లి విగ్రహంపై విమర్శలు చేసిన కాంగ్రెస్.. ఇప్పుడు ఎవరినీ సంప్రదించకుండానే తుదిరూపు ఎలా ఇచ్చిందని కవులు, కళాకారులు మండిపడుతున్నారు. గతంలో కాంగ్రెస్ రూపొందించిన తెలంగాణ తల్లి విగ్రహ ఫోటోలను నెటిజన్లు సోషల్ మీడియాలో షేర్ చేస్తూ రేవంత్ సర్కారు వైఖరిని ఎండగడుతున్నారు. తెలంగాణ ఆడబిడ్డ లంటే ఇంత చిన్నచూపా? నగలు, కిరీటాలు ఉండొద్దా? అంటూ నిలదీస్తున్నారు. 'తెలంగాణ తల్లి రూపాన్ని మారుస్తాం. సంస్కృతి, సంప్రదాయాలు కనిపించేలా, ప్రజల మనసుల్లో ఉన్న రూపాన్ని తీసుకొస్తాం. ఇందుకు రాష్ట్రంలోని అన్ని వర్గాల అభిప్రాయాలు తీసుకుని, ప్రజల అభీష్టం మేరకు మార్పులు చేస్తాం' అంటూ ఫిబ్రవరి 4న మంత్రివర్గ సమావేశం తర్వాత ప్రభుత్వం ప్రకటించింది. సంప్రదింపుల కోసం డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క నేతృత్వంలోని క్యాబినెట్ సబ్‌కమిటీ ఏర్పాటు చేసింది. కానీ సబ్ కమిటీ ఎవరిని సంప్రదించిదని, విగ్రహాన్ని గుట్టుగా దాచాల్సిన అవసరమేంటని తెలంగాణవాదులు ప్రశ్నిస్తున్నారు.



బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు అవార్డు ప్రదానం చేస్తున్న నిర్వాహకులు

## మలయాళీలది కష్టపడేతత్వం

- ప్రపంచంలో ఏ మూలకు వెళ్లినా కేరళ వాళ్లు ఉంటారు
- టైకాన్ కేరళ అవార్డుల ప్రదానోత్సవంలో బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

హైదరాబాద్, డిసెంబర్ 5 (నమస్తే తెలంగాణ): మలయాళీలు స్వతహాగా కష్టపడేతత్వం కలిగినవారని, ప్రపంచంలోని ఏమూలకు వెళ్లినా కేరళవారు ఉంటారని భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కే తారకరామారావు చెప్పారు. అమెరికా వంటి దేశాల్లో కేరళ పారిశ్రామికవేత్తలను చూసినప్పుడు ఈ విషయం అర్థమవుతుందని పేర్కొన్నారు. కేరళలో పెట్టుబడులను పెంచే కార్యక్రమాన్ని చేపట్టగలిగే శక్తి ప్రతి ఒక్క మలయాళీలోనూ ఉన్నదని ప్రశంసించారు. కొచ్చి నగరంలో గురువారం నిర్వహించిన టైకాన్ కేరళ అవార్డుల ప్రదానోత్సవంలో కేటీఆర్ మాట్లాడుతూ.. కేరళలో పెట్టుబడులకు దోహదం చేయడంలో టైకాన్ కేరళ ప్రతినిధులు నిర్వాహకులుగా చేసిన కృషి అభినందనీయమని ప్రశంసించారు. ప్రతి అంశంలోనూ రాష్ట్రాల మధ్య పోలిక అవసరం లేదని పేర్కొన్నారు. ఆయా రాష్ట్రాలకు తమ బలాలు, ప్రాధాన్యతలు ఉన్నాయని గుర్తించి వాటి ఆధారంగా ముందుకు సాగాలని అభిప్రాయపడ్డారు. పలు రాష్ట్రాలు అనేక రంగాల్లో అద్భుతమైన ప్రగతిని సాధించాయని, వాటి అనుభవాల నుంచి పాఠాలు నేర్చుకోవడం ద్వారా అన్ని రాష్ట్రాలు ప్రగతిబాటలో పయనించవచ్చని చెప్పారు. కేరళ సామాజిక, ఆర్థిక రంగాల్లో సాధించిన ప్రగతి ఆధారంగా అనేక అంశాలను నేర్చుకొనే అవకాశం ఉంటుందని తెలిపారు. వ్యక్తిగత హోదాలో, కేరళలో ఆంత్రప్రెన్యూర్‌షిప్ డెవలప్‌మెంట్ కోసం అవసరమైన మద్దతు ఇస్తానని హామీ ఇచ్చారు. భవిష్యత్తులో ఇలాంటి సమావేశాలు జరిగితే తప్పకుండా పాల్గొంటానని చెప్పారు.

## కేసీఆర్ ఫ్లెక్సీకి క్షీరాభిషేకాన్ని అడ్డుకున్న పోలీసులు

- మెడికల్ కళాశాల వద్ద బీఆర్‌ఎస్ నాయకుల అరెస్ట్
- ఖండించిన నల్లగొండ మాజీ ఎమ్మెల్యే కంచర్ల



నల్లగొండలో బీఆర్‌ఎస్ నేతల నుంచి ఫ్లెక్సీని లాక్కొంటున్న పోలీసులు

నీలగిరి, డిసెంబర్ 5 : నల్లగొండ జిల్లాకు మెడికల్ కళాశాల మంజూరు చేసి, నిధులు కేటాయించి దాదాపు నిర్మాణాన్ని పూర్తి చేసినందుకు కృతజ్ఞతగా బీఆర్‌ఎస్ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో గురువారం చేపట్టిన కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకాన్ని పోలీసులు అడ్డుకున్నారు. బీఆర్‌ఎస్ నాయకులు వైద్య కళాశాలకు చేరుకోగానే పోలీసులు వచ్చి, అనుమతి లేదని నిలువరించారు. కేసీఆర్ చిత్రపటాన్ని బీఆర్‌ఎస్ నేతల నుంచి తీసుకునే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో పోలీసులకు బీఆర్‌ఎస్ నాయకులకు మధ్య తోపులాట జరిగింది. దీంతో పోలీసులు వారిని అరెస్టు చేసి సుదూర ప్రాంతాల పోలీస్ స్టేషన్‌లకు తరలించారు. ఈ ఘటనను మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. నల్లగొండ వైద్య కళాశాలకు రూ.250 కోట్లు కేటాయించి రూ.125 కోట్లతో భవన నిర్మాణం చేపట్టారని చెప్పారు. అందుకు కృతజ్ఞతగా కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేయాలని నిర్ణయిస్తే బీఆర్‌ఎస్ నాయకులను ఆరెస్టు చేయడం ఏమిటని ప్రశ్నించారు.



## భూకంపాన్ని తట్టుకొని నిలబడ్డ మేడిగడ్డ

- నాడు భారీ వరదను..నేడు భూకంపాన్ని తట్టుకున్న బరాజ్
- తేల్చిన ఇంజినీరింగ్ అధికారులు

మహదేవపూర్, డిసెంబర్ 5 : కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో అంతర్భాగమైన జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలోని మేడిగడ్డ (లక్ష్మీ) బరాజ్ భూకంపాన్ని తట్టుకొని నిలబడింది. బుధవారం వచ్చిన భూప్రకంపన నేపథ్యంలో బరాజ్ ఇంజినీరింగ్ అధికారులు అప్రమత్తమయ్యారు. బరాజ్‌లోని ఏడో బ్లాక్‌తోపాటు బరాజ్ అప్, డౌన్ స్ట్రీమ్‌తోపాటు సాంకేతిక అంశాలపైనా క్షుణ్ణంగా పరిశీలించారు. భూకంపం నేపథ్యంలో బరాజ్‌లో ఎలాంటి మార్పులు సంభవించలేదని, ప్రస్తుతం బరాజ్ సేఫ్‌గానే ఉన్నదని అధికారులు తేల్చారు. 2023 సంవత్సరం వర్షాకాలంలో సుమారు 24 లక్షల క్యూసెక్కుల వరద ప్రవాహం, 2024లో సుమారు 10 లక్షల క్యూసెక్కుల వరదను తట్టుకోవడంతోపాటు ప్రస్తుతం వచ్చిన భూకంపాన్ని తట్టుకొని నిలబడటం గమనార్హం. ఇన్నాళ్లు బరాజ్‌పై అవాస్తవాలు ప్రచారాలు చేసిన వాళ్ల నోళ్లు మూతపడేలా బరాజ్ నిలిచిందని పలువురు రైతులు అభిప్రాయపడుతున్నారు.

## 'తెలంగాణ తల్లి'ని మార్చితే ఊరుకోం



సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న శుభప్రద్ పటేల్, ఉపేందర్, నర్సింహా, విద్యాసాగర్

ఖైరతాబాద్, డిసెంబర్ 5(నమస్తే తెలంగాణ): నాలుగు కోట్ల మంది ప్రజల అస్తిత్వానికి ప్రతిరూపమైన తెలంగాణ తల్లి విగ్రహాన్ని మార్చేందుకు సీఎం రేవంత్‌రెడ్డి కుట్రపూరితంగా వ్యవహరిస్తున్నారని రాష్ట్ర బీసీ కమిషన్ మాజీ సభ్యుడు శుభప్రద్‌పటేల్ మండిపడ్డారు. రేవంత్‌రెడ్డి రహస్య ఎజెండాతోనే విగ్రహం రూపురేఖలు మార్చాలని నిర్ణయించినట్టు ఆరోపించారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో బీసీ కమిషన్, ఎస్సీ, ఎస్టీ కమిషన్ మాజీ సభ్యులతో కలసి మీడియాతో మాట్లాడారు. తెలంగాణ ఉద్యమ సమయంలో తెలంగాణ రాష్ట్ర అస్తిత్వాన్ని ప్రతిబింబించేలా మేధావులు, కవులు, కళాకారుల ఆలోచనలకు ప్రతిరూపంగా తెలంగాణ తల్లి విగ్రహాన్ని రూపొందించారని గుర్తుచేశారు. తెలంగాణ తల్లి విగ్రహాన్ని మార్చితే ప్రతిఘటిస్తామని హెచ్చరించారు. రేవంత్‌రెడ్డి సీఎం పదవిలో కూర్చోగానే తెలంగాణ అస్తిత్వాన్ని చెరిపేసే ప్రయత్నాలు మొదలుపెట్టాడని బీసీ కమిషన్ మాజీ సభ్యుడు సీహెచ్ ఉపేందర్ విమర్శించారు. తెలంగాణ తల్లి విగ్రహం మార్చుతుంటే ఎమ్మెల్సీ కోదండరాం ఏం చేస్తున్నారని ప్రశ్నించారు.

### అస్తిత్వం జోలికొస్తే మరో ఉద్యమం: చిలకమర్రి నర్సింహ

తెలంగాణ తల్లి విగ్రహం భావిబంగారు తెలంగాణకు ప్రతిరూపం అని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ మాజీ సభ్యుడు చిలకమర్రి నర్సింహ తెలిపారు. కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ సిద్ధాంతకర్త జయశంకర్ సార్, బీఎస్ రాములు లాంటి మేధావులు, కవులు, కళాకారులు విగ్రహానికి రూపకల్పన చేశారని చెప్పారు. తెలంగాణ అస్తిత్వాన్ని తుడిచివేయాలని చూస్తే ఉద్యమం తప్పదని తేల్చిచెప్పారు.

### టీఎస్‌ను టీజీ చేస్తే అభివృద్ధి జరిగిందా?: విద్యాసాగర్

సీఎం రేవంత్‌రెడ్డి అభివృద్ధి పనులను, హామీలను పక్కన పెట్టారని ఎస్సీ, ఎస్టీ కమిషన్ మాజీ సభ్యుడు విద్యాసాగర్ మండిపడ్డారు. టీఎస్‌ను టీజీ చేస్తే అభివృద్ధి జరిగిందా? అని ప్రశ్నించారు. ఉద్యమకారులు కన్నెర్ర చేస్తే కాంగ్రెస్ ప్రభుత్వం కొట్టుకుపోతుందని హెచ్చరించారు.

## రాష్ట్ర సాధనలో భాస్కర్ పాత్రను మరువలేం



రామవరం, డిసెంబర్ 5 : రాష్ట్ర సాధనలో మలిదశ ఉద్యమకారుడు మోరె భాస్కర్‌రావు పాత్ర మరువలేనిదని రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర పేర్కొన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా రామవరంలో భాస్కర్ మరణ వార్త తెలుసుకున్న ఆయన ఢిల్లీ నుంచి గురువారం నేరుగా చేరుకున్నారు. ఆయనతోపాటు బీఆర్‌ఎస్ భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు, మాజీ మంత్రి వనమా వెంకటేశ్వరరావు, దిండిగల రాజేందర్‌భాస్కర్ మృతదేహానికి నివాళులర్పించారు. ఎంపీ వద్దిరాజు ఫోన్ ద్వారా మాజీ మంత్రి కేటీఆర్, కవిత భాస్కర్ కుటుంబ సభ్యులతో మాట్లాడి, ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, సాబీర్‌పాషా, కోనేరు సత్యనారాయణ, రంగాకిరణ్ పాల్గొన్నారు.

## రేపటి ఆటోబంద్‌ను విజయవంతం చేయండి

హిమాయత్‌నగర్, డిసెంబర్ 5: రాష్ట్రంలో ఆటోడ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ శనివారం(ఈనెల 7న) నిర్వహించే ఆటోబంద్‌ను విజయవంతం చేయాలని తెలంగాణ ఆటోరిక్షా డ్రైవర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బీ వెంకటేశం పిలుపునిచ్చారు. హిమాయత్‌నగర్‌లోని ఎస్‌ఎన్‌రెడ్డిభవన్‌లో గురువారం మీడియాతో మాట్లాడారు. సామాజిక భద్రత కోసం సంక్షేమబోర్డును ఏర్పాటు చేసి ఏడాదికి రూ.15 వేల ఆర్థిక సాయం అందించాలని డిమాండ్ చేశారు. పెరిగిన ధరలకు అనుగుణంగా ఆటోమీటర్ చార్జీలు పెంచి, కొత్త ఆటోలకు పర్మిట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

## రాజ్యాంగ నిర్మాతకు సర్కార్ అవమానం

- భారీ అంబేద్కర్ విగ్రహ ప్రాంగణానికి తాళాలు
- నిరసనగా బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ
- నేడు అంబేద్కర్ వర్ధంతి.. బీఆర్‌ఎస్ నివాళి

హైదరాబాద్, డిసెంబర్ 5 (నమస్తే తెలంగాణ): రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌ను రేవంత్‌రెడ్డి సర్కార్ ఏడాదిగా అవమానిస్తున్నదని బీఆర్‌ఎస్ పార్టీ ధ్వజమెత్తింది. కేసీఆర్ ఆనవాళ్లు లేకుండా చెరిపేస్తామని ప్రకటించిన సీఎం రేవంత్‌రెడ్డి, కేసీఆర్ నిర్మించారనే కారణంతోనే హైదరాబాద్‌లో భారీ అంబేద్కర్ విగ్రహ ప్రాంగణానికి తాళాలతో సంకెళ్లు వేయించారని విమర్శించింది. సర్కార్ తీరుకు నిరసనగా శుక్రవారం ఉదయం 10 గంటలకు 125 అడుగుల అంబేద్కర్ విగ్రహం వద్ద పూలు చల్లి నివాళులు అర్పించనున్నట్టు బీఆర్‌ఎస్ ప్రకటించింది. బీఆర్‌ఎస్ పార్టీ శ్రేణులు శుక్రవారం ఉదయం 9 గంటలకు తెలంగాణ భవన్‌కు చేరుకొని అక్కడి నుంచి 125 అడుగుల అంబేద్కర్ విగ్రహం వద్దకు వెళ్లి ఆ మహనీయుడి వర్ధంతి సందర్భంగా నివాళులు అర్పించాలని పిలుపునిచ్చింది. రాజ్యాంగాన్ని తుంగలో తొక్కుతూ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్న రేవంత్‌రెడ్డి నుంచి రాష్ట్రాన్ని కాపాడాలని కోరుతూ అంబేద్కర్ సాక్షిగా తెలంగాణ సమాజానికి తెలిసేలా తాము ఈ నిరసన కార్యక్రమాన్ని చేపడుతున్నట్టు బీఆర్‌ఎస్ ప్రకటించింది.

# గురుకులాలకు వస్తే నిర్బంధమా?

బీఆర్‌ఎస్ నాయకుల గురుకుల బాట కొనసాగుతున్నది. దీంతో తమ వైఫల్యాలు ఎక్కడ బయటపడుతాయోనని ప్రభుత్వం అడుగడుగునా అడ్డంకులు సృష్టిస్తున్నది. గురుకులాలను సందర్శించకుండా గేట్లకు తాళాలు వేస్తూ ఆంక్షలు విధిస్తున్నది. పలుచోట్ల బీఆర్‌ఎస్ నేతలను అరెస్టు చేయిస్తున్నది. మరోవైపు బీఆర్‌ఎస్ నాయకులు గురుకులాల్లో ఉన్న అధ్వాన పరిస్థితిని ఎత్తిచూపుతున్నారు. గేట్లకు తాళాలు వేసినా విద్యార్థులతో మాట్లాడి సమస్యలను తెలుసుకుంటున్నారు.


### • విద్యార్థులతో మాట్లాడకుండా గేట్లకు తాళాలా? : మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్



జగిత్యాల జిల్లా గొల్లపల్లిలోని గురుకులం గేట్ బయట నుంచి విద్యార్థినులతో మాట్లాడుతున్న కొప్పుల ఈశ్వర్

గొల్లపల్లి, డిసెంబర్ 5 : రాష్ట్రంలో నిర్బంధ పాలన కొనసాగుతున్నదని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ధ్వజమెత్తారు. గురుకులాల్లో సమస్యలు తెలుసుకోవడానికి వస్తే తమను అడ్డుకోవడమేమిటని మండిపడ్డారు. గురువారం జగిత్యాల జిల్లా గొల్లపల్లి బీసీ గురుకుల బాలికల పాఠశాలను జడ్పీ మాజీ చైర్మన్ దావ వసంతతో కలిసి కొప్పుల సందర్శించేందుకు రాగా, లోపలికి వెళ్లకుండా అడ్డుకొని గేట్‌కు తాళం వేశారు. ఈ విషయం తెలుసుకొని విద్యార్థినులు గేట్ వద్దకు రాగా, కొప్పుల వారితో ముచ్చటించారు. 1100 గురుకులాలు స్థాపించి అన్ని వర్గాల పిల్లలకు మెరుగైన విద్య అందుబాటులోకి తెచ్చిన ఘనత కేసీఆర్ సర్కార్‌దేనని కొనియాడారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన 11 నెలల్లోనే గురుకుల వసతి గృహాల్లో 50 మంది విద్యార్థులు మరణించడం బాధాకరమని అన్నారు.

### • పురుగుల అన్నం పెడుతున్నరు మేడం..



ఇనుగుర్తి, డిసెంబర్ 5 : 'పురుగుల అన్నం పెడుతున్నరు.. నీళ్ల కూరలు వడ్డిస్తున్నరు' అంటూ మహబూబాబాద్ జిల్లా ఇనుగుర్తి మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో విద్యార్థినులు వాపోయారు. గురుకుల పాఠశాలలో నాణ్యతలేని భోజనంపై 'ముద్ద అన్నం.. నీళ్ల కూరలు' అనే శీర్షికన గురువారం 'నమస్తే తెలంగాణ'లో ప్రచురితమైన కథనానికి కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ స్పందించారు. సదరు గురుకుల పాఠశాలను తనిఖీ చేయాలని సివిల్ సప్లయీస్ అధికారులను ఆదేశించారు. ఆ మేరకు సివిల్ సప్లయీస్ మేనేజర్ కృష్ణవేణి, జిల్లా క్వాలిటీ కంట్రోలర్ (క్యూసీ) శంకరయ్య, సాంఘిక సంక్షేమ గురుకులం భద్రాద్రి జోన్ ఆఫీసర్ స్వరూప పాఠశాలలోని వంటశాలను తనిఖీ చేశారు. విద్యార్థినులతో మాట్లాడారు. తమకు పురుగుల అన్నం, నీళ్ల కూరలు పెడుతున్నారని, అన్నం ముద్దలు ముద్దలుగా ఉంటుందని తెలిపారు. మినరల్ వాటర్ రావడం లేదని, బోరు వాటర్‌తో సమస్యలు వస్తున్నాయని వాపోయారు. అనంతరం క్యాటరింగ్ కాంట్రాక్టర్ మురళికి జోన్ ఆఫీసర్ స్వరూప మెమో జారీ చేశారు. రుచికరంగా వంటలు చేయాలని, లేకపోతే చర్య లు తప్పవని క్యాటరింగ్ సిబ్బంది హెచ్చరించారు.

### • ప్రజా పాలన కాదు.. రాక్షస పాలన



ఎర్రుపాలెం, డిసెంబర్ 5 : ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాష్ట్రంలో చేస్తున్నది ప్రజా పాలన కాదని.. రాక్షస పాలన అని జడ్పీ మాజీ చైర్మన్, బీఆర్‌ఎస్ మధిర నియోజకవర్గ ఇన్‌చార్జి లింగాల కమల్‌రాజు మండిపడ్డారు. ఖమ్మం జిల్లా ఎర్రుపాలెంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలను గురువారం సందర్శించేందుకు వెళ్తుండగా.. పోలీసులు అడ్డుకున్నారు. కమల్‌రాజుతోపాటు బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు సాంబశివరావు, ఏఎంసీ మాజీ చైర్మన్ చిత్తారు నాగేశ్వరరావు, నాయకులను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

### • ఇంకెంత మందిని పొట్టన బెట్టుకుంటరు



తాండూర్, డిసెంబర్ 5 : ప్రభుత్వం ఇంకెంత మంది గురుకుల విద్యార్థులను పొట్టన బెట్టుకుంటుందని బీఆర్‌ఎస్వీ మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు బడికల శ్రావణ్ ప్రశ్నించారు. గురుకుల బాటలో భాగంగా గురువారం మంచిర్యాల జిల్లా తాండూరులోని మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల సందర్శనకు నాయకులతో కలిసి వెళ్లగా యాజమాన్యం, పోలీసులు అడ్డుకొన్నారు. దీంతో బీఆర్‌ఎస్వీ నాయకులు, కార్యకర్తలు ధర్నాకు దిగారు.

### • అరెస్టుల పర్వం



హసన్‌పర్తి/ఐనవోలు/ఆత్మకూరు, డిసెంబర్ 5 : హనుమకొండ జిల్లాలో గురుకులాల సందర్శనకు గురువారం వెళ్లిన బీఆర్‌ఎస్, బీఆర్‌ఎస్వీ నాయకులను పోలీసులు అడ్డుకొని అరెస్ట్ చేశా రు. హసన్‌పర్తి మండలం ఎల్లాపూర్‌లో ని ఎంజేపీ గురుకుల పాఠశాలను బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు బండి రజినీకుమార్ ఆధ్వర్యంలో నాయకులు సందర్శించేందుకు వెళ్లగా పోలీసులు అడ్డుకొ ని అరెస్ట్ చేశారు. ఐనవోలు మండలంలోని కేజీబీవీ సందర్శనకు బీఆర్‌ఎస్వీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ అరూరి రంజిత్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ కంజర్ల మనోజ్‌కుమార్ ఆధ్వర్యంలో నాయకులు వెళ్ల గా ఎస్సై పస్తం శ్రీనివాస్ అడ్డుకున్నారు. ఆత్మకూరు, దామెర మండలాల్లోని గు రుకులాలను బీఆర్‌ఎస్వీ నేతలు బైరపాక ప్రశాంత్, అర్షం మధుకర్ ఆధ్వర్యంలో సందర్శించి సమస్యలు తెలుసుకుంటుండగానే పోలీసులు వచ్చి అడ్డగించారు.




విద్యార్థులను దవాఖానకు తీసుకెళ్లిన పాఠశాల సిబ్బంది

## 'ఆదర్శ' విద్యార్థులకు అస్వస్థత

నల్లగొండ జిల్లా పెంచికల్ పహాడ్‌లో ఘటన

దేవరకొండ రూరల్, డిసెంబర్ 5 : నల్లగొండ జిల్లా దేవరకొండ మండలంలోని పెంచికల్ పహాడ్ ఆదర్శ పాఠశాలలో ఐదుగురు విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. మధ్యాహ్న భోజనం చేసిన తర్వాత కడుపు నొప్పి, వాంతులు వచ్చాయని విద్యార్థులు చెప్పడంతో వారిని అంబులెన్స్‌లో దేవరకొండ ప్రభుత్వ దవాఖానకు తరలించి చికిత్స అందించారు. జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ ఆదేశానుసారం దేవరకొండ సీనియర్ సివిల్ జడ్జి, మండల న్యాయసేవ అధికార సంస్థ చైర్‌పర్సన్ కే అనిత, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి పీ రవీందర్, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి హరిబాబు పాఠశాలను సందర్శించి విద్యార్థులను పరామర్శించారు. పాఠశాల పరిసరాలను, వంట గదిని పరిశుభ్రంగా ఉంచాలని, విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని సూచించారు.



## ఉపాధ్యాయులే వంట మనుషులై..

ఐనవోలు, డిసెంబర్ 5 : పాఠాలు బోధించే ఉపాధ్యాయులు భోజనం వండి, వడ్డించిన ఘటన హనుమకొండ జిల్లా ఐనవోలు మండలం గర్మిళ్లపల్లి ప్రాథమిక పాఠశాలలో గురువారం జరిగింది. మధ్యాహ్న భోజనం ఉంటే నిర్వాహకులకు రూ. 40వేల వరకు బిల్లులు పెండింగ్‌లో ఉండడంతో వారు గురువారం వంట చేయడానికి రాలేదు. దీంతో హెచ్‌ఎం రజిత, ఉపాధ్యాయులు వంట చేసి విద్యార్థులకు వడ్డించారు. పాఠశాల పరిశీలనకు వచ్చిన తహసీల్దార్ విక్రమ్‌కుమార్ వచ్చారు.

## విద్యార్థులకు పోషకాహారం పెట్టాల్సిందే

- ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం



హైదరాబాద్, డిసెంబర్ 5 (నమస్తే తెలంగాణ): మధ్యాహ్న భోజనం వికటించిన పాఠశాలల స్థితిగతులపై సమగ్ర నివేదిక ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. విద్యార్థులకు పోషకాలతో కూడిన ఆహారాన్ని పెట్టితీరాలని తేల్చి చెప్పింది. భోజనం వికటించిన ఘటనలపై ప్రభుత్వం ఏర్పాటుచేసిన టాస్క్‌ఫోర్స్ కమిటీలు, వాటిలోని సభ్యుల వివరాలను నివేదించాలని ఉత్తర్వులు జారీ చేసింది. పాఠశాలల్లో అందించే మధ్యాహ్న భోజనంలో నాణ్యతాప్రమాణాలు పాటించడం లేదని, ప్రైవేట్ పాఠశాలలో ఫీజు నియంత్రణకు కమిటీని నియమించేలా ప్రభుత్వానికి ఉత్తర్వులు ఇవ్వాలని కోరుతూ హెల్ప్ ది పీపుల్ చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు కీతినీడి అఖిల్‌శ్రీ గురుతేజ వేసిన ప్రజాప్రయోజన వ్యాజ్యంపై ప్రధాన న్యా యమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ శ్రీనివాసరావుతో కూడిన ద్విసభ్య ధర్మాసనం గురువారం విచారణ జరిపింది. పిటిషనర్ తరఫున న్యాయవాది చిక్కుడు ప్రభాకర్ వాదనలు వినిపిస్తూ.. కేంద్ర మార్గదర్శకాల ప్రకారం గ్రామ, మండల, జిల్లా, రాష్ట్రస్థాయి కమిటీలు ఏర్పాటు చేసి మధ్యాహ్న భోజనాన్ని పక్కాగా పర్యవేక్షించాల్సి ఉంటుందని, కానీ అలా జరగడం లేదని చెప్పారు. ప్రభుత్వం తరఫున ఏఏజీ వాదనలు వినిపిస్తూ.. 'నారాయణపేట, కరీంనగర్ జిల్లాల కలెక్టర్ల నేతృత్వంలో వేర్వేరుగా కమిటీలు ఏర్పాటు చే శాం. భోజనం వికటించిన ఘటనపై దర్యా ప్తు జరుగుతున్నది. రాష్ట్రంలో మొత్తం 25,941 ప్రభుత్వ పాఠశాలున్నాయి. 18 లక్షల మందికిపైగా విద్యార్థులన్నారు. మూడు చోట్ల 75 మంది విద్యార్థులు మధ్యాహ్న భోజనం తిని అస్వస్థతకు గురయ్యారు. ఇలాంటివి మరోసారి జరగకుండా తగిన చర్యలు తీసుకుంటున్నాం. మధ్యాహ్న భోజన ఏజెన్సీలకు ప్రభుత్వం ఇచ్చే నిధులను కూడా పెంచింది' అని పేర్కొన్నారు.

## ఎన్‌కౌంటర్‌పై ఎన్‌హెచ్‌ఆర్‌సీకి వెళ్లండి

- పిటిషనర్‌కు హైకోర్టు సూచన

హైదరాబాద్, డిసెంబర్ 5 (నమస్తే తెలంగాణ): ములుగు జిల్లా ఏటూరునాగారం మండలం పూలకొమ్మ అడవుల్లో జరిగిన ఎన్‌కౌంటర్ మృతులకు తిరిగి పోస్టుమార్టం నిర్వహించేందుకు ఉత్తర్వులు జారీచేయలేమని హైకోర్టు స్పష్టంచేసింది. ఎన్‌కౌంటర్‌పై జ్యుడీషియల్ విచారణ, బంధువుల సమక్షంలో రెండోసారి ఇంక్వెస్ట్ చేసేందుకు కూడా అనుమతించలేమని తేల్చి చెప్పింది. కాగా, ఇప్పటికే ఆరుగురి మృతదేహాలను బంధువులకు అప్పగించామని, హైకోర్టు ఆదేశించిన కారణంగా మల్లయ్య మృతదేహం మాత్రమే భద్రపర్చామని ప్రభుత్వం తెలిపింది. మల్లయ్య మృతదేహాన్ని కూడా బంధువులకు అప్పగించాలని కోర్టు ఆదేశాలిచ్చింది. ఎన్‌కౌంటర్ బూటకమంటూ మృతు డు మల్లయ్య భార్య కే ఐలమ్మ అలియాస్ మీనా వేసిన పిటిషన్‌పై గురువారం జస్టిస్ బీ విజయ్‌సేన్‌రెడ్డి విచారణ జరిపారు. ఈ ఘటనపై జాతీయ మానవ హక్కుల కమిషన్ సుమోటోగా విచారణ చేస్తున్నదని, పిటిషనర్ ఆ కమిషన్ వద్దకు వెళ్లవచ్చునని సూచించింది. కేసును ఈ నెల 26కు వాయిదా వేసింది.

## టీసీ ఇచ్చారని విద్యార్థి ఆత్మహత్యాయత్నం?

అచ్చంపేట రూరల్, డిసెంబర్ 5 : అకారణంగా టీసీ ఇచ్చారని గురుకుల విద్యార్థి ఆత్మహత్యాయత్నం చేసిన ఘటన నాగర్‌కర్నూల్ జిల్లాలో చోటు చేసుకున్నది. విద్యార్థి కుటుంబ సభ్యుల కథనం మేరకు.. అచ్చంపేట మండలం బోల్గాట్‌పల్లికి చెందిన విద్యార్థి అచ్చంపేట ఎస్సీ గురుకుల పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నాడు. తల్లిదండ్రులు కృష్ణమ్మ, ఈశ్వరయ్య హైదరాబాద్‌కు వలస వెళ్లి కూలీ పనులు చేస్తున్నారు. సదరు విద్యార్థి రాజధానిలోని తల్లిదండ్రుల వద్దకు వెళ్లి వస్తుంటాడు. ఈ విద్యార్థి పేరుతోనే ఉన్న మరో విద్యార్థి హైదరాబాద్ గురుకులంలో 8వ తరగతి చదువుతున్నాడు. అతడు పలు చోరీ ఘటనల్లో పోలీస్ కేసుల్లో ఇరుక్కున్నాడు. ఇద్దరి పేర్లు ఒకేలా ఉండడంతో పోలీసులు పాఠశాలలో సదరు పేరుపై ఎవరైనా ఉన్నారా అని ఇటీవల ఆరా తీశారు. తరచూ హైదరాబాద్‌కు వెళ్లి వస్తుండడంతో అతడిపై క్లాస్ టీచర్ అనుమానం వ్యక్తం చేసి, టీసీ ఇచ్చి పంపించారు. తనను దొంగ అని క్రియేట్ చేశారని మనస్తాపంతో గురువారం గ్రామంలో గుళికల మందు తాగేందుకు యత్నించగా కుటుంబ సభ్యులు అడ్డుకున్నారు. గురుకుల ప్రిన్సిపాల్ అంజయ్యను వివరణ కోరగా.. విద్యార్థి తల్లిదండ్రుల ఆరోపణల్లో నిజం లేదని పేర్కొన్నారు. విద్యార్థి పలుమార్లు తరగతులు ఎగ్గొట్టి ఇంటి వద్ద ఉండేవాడని తెలిపారు.